కథానిక

# త్యాగమయి కదంబ

యం. హీరాలాల్ రాయ్

డార్జిలింగ్ టీ తోటల సౌందర్యానికి ముగ్ధుడై, ఒకనాడు తన గదిలో నృత్యం చేయడం మొదలుపెట్టాడు కపూర్. కర్పూరంవంటి అతని మనస్సు ఆ సుందరమైన టీ తోటల శోభకి హారతిలా రగుల్కొన్నది. ముప్పై సంవత్సరాల వయస్సులో, ఎన్నడూ ఇంత ప్రత్యేకమైన ఉద్రేకం అతని మనస్సులో కలగలేదు. పదేండ్ల నుంచి టీ తోటల మేనేజరుగా పనిచేస్తున్నాడు. రంగురంగుల దుస్తులతో ఆకు గిల్లడానికి వచ్చే పల్లె పడుచుల్ని చూస్తున్నాడు, టీ తోటలమీదకి వాలి, చల్లని జల్లుకొట్టి పారిపోయే లేతలేత మబ్బు తునకలమీద దాడిచేసే సన్నలి గాలి తెరలు, వాటి తాకిడికి పెద్దపెద్ద గాలిపటాల మాదిరి అల్లల్లాడి, ఎగిరిపోయే లేత మబ్బులు, బారులు బారులుగా వరసల్లో నించున్న తేయాకు మొక్కలు తలలు వూపుతూ నాట్యం చేయడం, ఆ మొక్కల మధ్యగా పూలపూల దుస్తులు ధరించి తేయాకు చిగుళ్లు రెల్లుతోన్న పల్లెపడుచులు- ఇవన్నీ తాను పది సంవత్సరాలనుంచీ చూస్తున్నవే. ఐతే ఇప్పుడీ అంతులేని కొత్త ఉత్సాహం, కొత్త ఆనందం దేనికి?

కపూర్ వుంటూన్న బంగళా పక్కగా ఒక చిన్న యేటి కాలువ పారుతున్నది. ఏటి కాలవను చూస్తో బంగళాపైన ఒక చిన్న పుస్తకం పట్టుకొని కూనిరాగాలు తీస్తున్నాడు. అప్పుడప్పుడు తన వైలిన్ తీగల్ని సర్దుకుని, రాగాలకి ధ్వని అందిస్తున్నాడు.

"బంగారపు మబ్బుల దండలు,
కట్టుకున్నవో తలలకు కొండలు
ఓహోహో! ఇదే పుణ్యమో!
నా జీవితమే ధన్యమో!"

పాడుతున్నాడు కపూర్. పాడుతూ పాడుతూ మధ్యమధ్యన ఆ గేయాలు రచించిన రచయిత్రి పేరు చూచుకుని కళ్ళ కద్దుకుంటాడు. ఆ రచయిత్రి పేరుకూడా ఎంత కమ్మగావుంది! "కదంబ!" కదంబ రాసిన పాటలు పాడుకుంటో తాను ఇదివరకు చూచిన ప్రకృతినే కొత్త దృక్కోణంనుంచి చూస్తూ ఆనందిస్తున్నాడు కపూర్. కపూర్ జీవితంలో కదంబ గేయాలు అమోఘమైన కొత్తదనాన్ని తెచ్చిపెట్టినవి.

సాయంత్రం పూట చల్లని ఆకాశం పూదుతున్న మెత్తని గాలులకు వూగే రంగురంగుల మబ్బుల వెనక సూర్యుడు, సూర్యుడి ప్రతిబింబంతో ఎర్రబారిన నీటికాలవ; కాలవ గలగలలో మేడ ముందుభాగాన కూచుని కదంబను తలుచుకుంటూ పాడుతున్నాడు కపూర్. అతని హృదయం నిండా కదంబ. కదంబనుగూర్చి ఆలోచించినప్పుడల్లా కదంబ పుష్పాల వాసన అతని హృదయంలో దుమారం లేపేది. యౌవనంతో మత్తెక్కిన గేయాలు రచించగల రచయిత్రి నవయౌవనంతో తుల తూగుతూ వుంటుంది. ఎర్రని మందారాలవంటి పెదవులూ, మల్లెపూలలాంటి కళ్లు, జామపళ్ళలాంటి బుగ్గలు, కదంబ ఎంతో సుందరంగా వుండివుంటుంది. లేనిదే ఇంత గొప్పగా రాస్తుందా?

"మైమరచిన నిశలల్లోనా"
మబ్బెక్కిన దిశలల్లోనా,
ఏదో నిండైన మనస్సు
ఎవరికోసమో వెదికేనో...

కదంబ ఎవరికోసమో వెదకుతో వుంటుంది. తప్పదు. కదంబకు ఆమె యౌవనాన్ని స్వీకరించగల యువకుడు కావాలి.

పాడడం ముగించి, గబగబా కదంబకు ఒక లేఖ రాశాడు.

"కవీ! నీవు నిండుహృదయంగల స్త్రీవి.

కవులు పురుషులుగా పుట్టడంకంటే, స్త్రీలుగా పుడితే ఈ లోకం ఇంత కల్లోలంగా వుండేది కాదు. నీవంటి వాళ్లు ఈ లోకంలో అరుదు. అసలు లేరేమో? నీ హృదయంలో పొంగిన పాటలు, నా క్రుంగిన మనస్సును లేవనెత్తి తమతో ఎటో తీసుకపోతూన్నవి. నాజీవితంలోని పాతిక ముప్పైసంవత్సరాలు చూచిన దృశ్యాలు, నేడు మళ్ళీ నీ గేయాల వినికిడివల్ల సరికొత్తగా కనిపిస్తున్నాయి. నీవు నాదేవతవు. నిన్ను నేను ఇంత దూరంనుంచి చూస్తున్నాను. నీవు కాశ్మీరంలో వుంటున్నావు. నేను ఇటు భారతదేశానికి తూర్పుమూలన వుంటున్నాను. కాని, నీవు నన్ను బలవంతంగా నీవైపుకు లాగేసుకుంటున్నావు. నేను అబద్ధాలు, బులిపింపులు రాస్తున్నాననుకోకు. ఇవి నా చెదిరిన గుండెలోంచి దూకిపడుతున్న శబ్దాలు. కదంబా! నా రంభా! నిన్ను నేను త్వరలో దర్శించుకుంటాను. వీలైతే నా దాన్నిగా చేసుకుంటాను. నీవు సుందర కాశ్మీరు భూభాగంనుండి నా టీ తోటలలో నీడల్లోకి వచ్చి, నాకూ లోకానికీ నూతనోత్సాహాన్ని కల్పించగలవు. రా! లేక నేనే రానా! నేనే రానా! నా ఒంటరి నివాసం ఇక ఈ ఇంట్లో దుర్భరంగా వుంటుంది కాబోలు? నీరాకకు నిరీక్షించనా? నారాకకై నీవు వేచివుంటావా!"

*　　*　　*

కదంబ తన పడకగదిలో పచ్చని లైటు వెల్తుర్లో మసకమసకగా కపూర్ రాసిన వుత్తరం చదువుకుంది. తన రచనలలో తాను కన్న కలలు నిజం అవుతూన్నట్టు భావించింది. తన వికారరూపాన్ని ఈలోకానికి చూపించ దలచక, ఈ అంధకారపు గదిలో పడివుండి, తన రచనల్తో లోకానికి మత్తెక్కించింది. కాని, తన జీవితాన్ని- ప్రేమవర్షంతో తడిపే యువకుడు తనకు ఇవాళటికీ కానరాలేదు. నేటికి సుదూరాన ఒక యువకుడు.

"రమ్ము రమ్ము నను జూచుటకై,
నా మనస్సునే దోచుటకై,
రావో! నా ప్రియుడా! నీకై
వేచియుందు చకోరికనై."

అనిరాసి కవర్ తన స్నేహితురాలు చంపక చేతిలోకి విసిరింది.

"ఇంత ఉత్సాహంగావున్నావేం కదంబా!" అంది చంపక. "ఇదే మహోత్సాహం! ఇంకా ముందు చూడు!" అంటూ కపూర్ రాసిన వుత్తరం చంపకమీదికి విసిరింది. చంపక గబగబా వుత్తరం చదువుకుంది. మాట్లాడలేదు.

"ఎలా వుంది వుత్తరం?" అని అడిగింది కదంబ.

"బాగానే వుంది" అంది చంపక గబగబా కవర్ పుచ్చుకుని పోస్టులో వేయడానికి వెడుతో. కదంబ ఏకాంతంగా తన గదిలో భవిష్యత్తును గూర్చి కలలు కంటోంది. అంతులేని ఆనందం ఆవిడ నావరించింది. డార్జిలింగ్ టీ తోటలు, అక్కడ సుందరుడైన కపూర్, పొలాలు, కొండలు, ఎంత అందంగా వుంటాయ్? తన భయంకరమైన ఒంటరితనం నశిస్తుంది. జంట ఏర్పడుతుంది.

"ఇక లేదో ఒంటరితనము,
లభియించెను ప్రేమ ధనము,
పెట్టవోలె రెక్కలు పరచుక
పోనా, టీ తోటలవైపుకు."

మరో కవర్లో ఈ గేయం రాసిపెట్టి పోస్టు చేసింది కదంబ.

*　　*　　*

కపూర్ టీ తోటల అజమాయిషీ చేసి వచ్చేప్పటికి తన డెస్కుమీద కవరువుంది. విప్పి చూస్తే గేయం. కదంబపుస్తకంలోని గేయాల కంటే ఉత్తమమైన గేయాలు వస్తున్నాయ్ తనకు. కదంబ యిప్పుడు మరీ మంచిగేయాలు రాస్తున్నది. తనకు కూడా గేయాలు రాయడం వస్తే ఎంత బావుండును?

"కదంబా! నాకు గేయాలు రాయడం రాదు. కాని మనస్సు కవి మనస్సే. నీకు నా మనస్సులో దాగివున్న భావాలు ఎట్లా చెప్పను! తేనీటి పరిమళాలతో మత్తెక్కిన మనస్సు, నా టీ కప్పులో నీ సుందర మూర్తిని చూచి మురిసి పోయింది. కదంబా! త్వరలో నిన్ను దర్శించుకుంటా." ఉత్తరం పోస్టు చేశాడు.

కపూర్ వయొలిన్ వాయించాడు. కొలవ పరుగెత్తడం మానుకుని విన్నది. ప్రకృతి కదంబరాసిన గేయాల అర్థాన్ని బాగా గ్రహించినట్టు తలపూపింది. కదంబ పంపిన గేయాన్ని మళ్ళీ మళ్ళీ పాడి తృప్తి పడ్డాడు కపూర్. కపూర్ మనస్సునిండా ఊహా కదంబ. కదంబ దేహం, ఆవిడ నవ్వులు, ఆవిడ చూపులు, ఆవిడ మెరుపులు. కదంబను ఊహించుకోడంలో రాత్రులు గడుస్తున్నాయి. కదంబ గేయాలు పాడ్డంతో పవళ్లు గడుస్తూన్నాయి.

* * *

"నువ్వు కపూర్‌కు ద్రోహం చేస్తున్నావు కదంబా!" అంది చంపక. "అదేం! నేనేం ద్రోహం చేశాను?" అంది కదంబ. "నీవు అతన్ని మురిపిస్తున్నావు. అతడు నిన్ను సుందరాతిసుందర స్త్రీగా తలంచి ఆనందిస్తున్నాడు. తీరా అతను నీవద్దకు వస్తే, నిన్ను చూస్తే ఏమవుతాడు? నీవే చెప్పు!" అంది చంపక.

"అతడు ఒక్కమాటు నన్ను కావలించుకుని, ముద్దుపెట్టుకుంటే చాలు. పాతిక సంవత్సరాల నా శుష్క జీవనం అమృతమయం అవుతుంది తెలుసా. ఒకఘడియ అతని బాహువుల్లో ఒరిగితే చాలు" అంది కదంబ.

"అన్యాయం. ఆ తర్వాత అతడు నొచ్చుకుంటాడు. ఇప్పుడే నీ ఫోటో పంపు. కనీసం ఫోటో అయినా మొదట చూచివుంటే, నీవద్దకు వచ్చినప్పుడు మోసం అని భావించకుండా వుంటాడు. నీ తప్పు కొంత శమిస్తుంది" అంది చంపక. "మంచిది. ఇవాళే నా ఫోటో పంపుతాను" అంది కదంబ.

ఆ నాడు చంపక తోటలోకి షికారు వెళ్ళినప్పుడు చంపక యొక్క ఫోటో కాపీ ఒకటి తెచ్చి దానికింద "కదంబ" అని రాసి కవర్లో పెట్టి కపూర్‌కు పోస్టు చేసింది. తనలో తను నవ్వుకుంది.

అయిదారు రోజుల్లో కపూర్ వద్దనుండి లేఖవచ్చింది. ఆ లేఖను చంపకకు చదవమని ఇచ్చింది కదంబ. అందులో ఇలా వుంది.

"నా కదంబా! నీ ఛాయా పటం అందింది. అంత అందంగా వున్నావేం? నేను ఊహించిన దానికన్నా ఎన్నో రెట్లు బావున్నావు. నీ కళ్ళల్లో అందాల మెరుపులు, నీ బుగ్గల పొందు నీ ముంగురుల వొంపులు, నన్ను చాలా ఆకర్షించాయి. నీవు నిజంగా నా దేవతవు. నేను త్వరలో వస్తున్నాను"

చంపక గబగబా ఉత్తరంచదివి ఆశ్చర్య పడింది.

కదంబ తనలో తాను నవ్వుకుంది.

* * *

"అమ్మగారూ! ఎవరో డార్జిలింగ్ నుంచి వచ్చారు మీకోసం. ఇదిగో ఏదో కార్డు ఇచ్చారు" అంటూ ఒక కార్డు అందించింది పనిమనిషి. కదంబ కార్డు చదువుకుంది. విజిటింగ్ కార్డుమీద "యం. హెచ్. కపూర్, యం. ఏ" అని వుంది. కదంబ వొళ్లు పులకరించింది. జలదరించింది. "చంపకా! చంపకా!" అని పిలిచింది. చంపక గబగబా తన గదిలోంచి పరుగెత్తుక వచ్చింది. "చంపకా! నేను తొందర తొందరగా ముస్తాబు అవుతాను. నీవు ఈ గదిలో గ్రీన్ లైట్ ఎరేంజ్ చేయి. నీవు కొస్త కిందికివెళ్ళి, కపూర్‌ను పైకి తీసుకోరా. అతన్ని జాగ్రత్తగా నా గదిలోకి తీసుకురావాలి సుమా! అతను నన్ను చూచేప్పుడు నేను జిగ జిగా మెరిసి పోతుండాలి" అంది కదంబ. చంపక తన మనస్సులో కొంత బాధపడ్డది. పాపం! కపూర్ వంటి ఉన్నతహృదయుడు, ఆకామూర్తి ఈమెను చూడగానే ఏమైపోతాడో? పిచ్చెత్తిపోడు గదా! తనకు కదంబ చేసిన దగాకు అతను ఎంతగా బాధపడతాడో?

కింద వెయిటింగ్ రూంలో కపూర్ నిల్చుని కదంబకోసం నిరీక్షిస్తున్నాడు. ఇన్నాళ్ళనుంచి కదంబకోసం చేసిన నిరీక్షణ ఇక దుర్భరమయిపోతున్నది.

చంపక మెల్లగా బంగళా దిగి కిందికి వస్తూన్నది. కపూర్‌ను తాను ఆహ్వానించాలి. కదంబ గదిలోకి కపూర్‌ను చేర్చాలి. ఆ తరవాత జరిగే ప్రళయానికి తను బాధ్యురాలు కాదు. కాని కపూర్‌ను కదంబ గదిలోకి పంపడంలో తాను కొంత తోడ్పడుతున్నది. అది మాత్రం కొంత ద్రోహమే. ఇలా ఆలోచించుకుంటూ మెట్లు దిగింది. వెయిటింగ్ రూం తలుపు తెరవాలి. అవతల కపూర్ ఆతురతతో

నించుని వుంటాడు. అతని మనస్సు కదంబ కోసం ఆరాట పడుతూంటుంది.

తలుపు తెరుస్తోన్న చప్పుడైంది. కపూర్ మనస్సులోతలుపు తెరుచుకుంటున్నట్టనిపించింది.

తలుపు విచ్చుకుంది. తాను చూచిన ఫోటోలో వస్తూన్న చంపక. కదంబ పంపిన ఫోటో చంపకదే కాని కపూర్ కేమి తెలుసు. ఫోటోలోని పోలికలన్నీ చంపకలో వున్నాయి.

"కదంబా!" అని గబాల్న కౌగిలించుకున్నాడు కపూర్ చంపకను. చంపక ఆ కౌగిలింతలో ఉక్కిరి బిక్కిరైంది. ఏమీ మాట్లాడలేకపోయింది. అకస్మాత్తుగా చంపకలో ఏదో కొత్త వుద్రేకం పొంగివచ్చింది. చంపక చేతులు అ ప్రయత్నంగా కపూర్‌ను కౌగిలించుకున్నాయి. కపూర్ వేడి పెదవులు చంపక పెదవుల్ని అద్దుకున్నాయి. చంపక శరీరంలోని పొంగులు కపూర్‌లోకి ప్రవేశించాయి. కపూర్ చంపకను తాగేస్తున్నాడు. ఒక పెద్ద ప్రళయం. వేడివేడి నిట్టూర్పుల మధ్య ఒకరినొకరు నలిపేసుకుంటున్నారు.

కదంబ ముస్తాబై గదిలో పచ్చని లైటు కాంతిలో కూచునివుంది. కపూర్ ఇంకా పైకి రాలేదు. చంపకకూడా రాలేదు.

అయిదు నిముషాల తరవాత కపూర్ తన బాహువుల్ని సడలించాడు. చంపక మెల్లగా తప్పుకుని "నేను కదంబను కాను" అంది.

"మరి, నాకు పంపిన ఫోటో నీ మాదిరే వుందే" అని తన జేబులోని ఫోటో తీసిచూపించాడు. చంపక మాట్లాడలేదు.

"నీవే కదంబవైతే..." అన్నాడు కపూర్.

"పదండి పైకి" అంది చంపక. గబగబా కపూర్ కదంబ గదిలో ప్రవేశించాడు. చంపక శరీరంతో కప్పబడివున్న కపూర్ కళ్లు కదంబను చూడగానే ఎర్రబడిపోయాయి.

"నీవు కదంబవా?" అన్నాడు కపూర్.

"అవును" అంది కదంబ.

"నన్నిలా ఎందుకు దగా చేశావ్?" అన్నాడు కపూర్. కదంబ మాట్లాడలేదు. కపూర్ నిశ్శబ్దంగా వెనుతిరిగి వచ్చాడు. కాలుతూన్న పెనంమీద నీళ్లు చల్లినట్టయింది. వెనుతిరిగి చంపకకోసం వెతికాడు. చంపక కనపడలేదు.

* * *

చంపక ఆరాత్రి నిద్రపోలేదు. వెక్కి వెక్కి యేడుస్తూన్న తన కదంబకు పరిచర్య చేయడంతోనే రాత్రి గడిచింది. తెల్లవారుజామున కదంబ చంపకను తనదగ్గరకు పిలిచి "చంపకా! నామనశ్శాంతికోసంనీవొకపనిచేయాలి!" అంది.

"ఏమిటది?" అంది చంపక.

"నీవు కదంబ పేరుతో ఇకముందు వ్యవహరించు. లోకం నా రచనల్ని మాత్రమే చూచింది కాని, నన్ను చూడలేదు. నేను ఈ వికారరూపంతో లోకానికి కనపడ దలుచుకోలేదు" అంది కదంబ.

"నీ పేరును వాడుకోవడం నావల్ల కాదు" అంది చంపక.

"నాకోసం ఆ పనిచేయి. నీవు నా స్నేహితురాలివి. నా కపూర్‌ను నీవు పెళ్ళిచేసుకో! నా మనస్సు తృప్తి పడుతుంది" అంది కదంబ.

మర్నాడు కపూర్‌వచ్చి కదంబ ఇంటి ముందు చంపకకోసం చూచాడు. కదంబ బంగళా మీదినుంచి చూచింది. కపూర్‌ను పైకి రమ్మని ఆహ్వానించింది. చంపకను పెళ్ళిచేసుకోమని బతిమాలింది.

టీతోటల కమ్మవాసనల్లో చంపక, కపూర్, కదంబ రాసిన గేయాలు పాడుకున్నారు. అజ్ఞాతంగా ఎవరికీ కనిపించకుండా త్యాగం చేసిన కదంబను గూర్చి చంపక విచారపడ్డది. ఇప్పుడు చంపకనే లోకం కదంబ అని పిలుస్తోంది. గౌరవిస్తోంది.

అసలు కదంబ లేదు. మనసు విరిగి స్వర్గం దారి పట్టింది.

"ఏ త్యాగ ధని సృష్టించిన పాటలో
ఏ కవయిత్రి పాడిన మాటలో
లోకాన్ని ఊగించును చల్లగా
అమృతాన్ని త్రాగించును మెల్లగా."

చంపక గేయాలు రాస్తోంది. కపూర్ సాయంకాలం ఎర్రని మబ్బుల దారిన వైలిన్ మీద పాడుతూన్నాడు. కదంబనుగూర్చి చంపక పరితపిస్తుంది. కపూర్ కదంబ గీతాలు పాడతాడు... కాని...

కదంబలేదు. కదంబ మళ్ళీ కానరాలేదు.